# పోలీసులపై అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

-చందుర్తి ఎస్సై రమేష్ హెచ్చరిక...

రాజకీయ లబ్ధి కోసం పోలీసులను వాడుకుంటే ఉపేక్షించం: క్లారిటీ ఇచ్చిన పోలీసులు



**చందుర్తి మండలం /మార్చి 06 ప్రజా దివాస్**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి నివేదిక కార్యక్రమం సందర్భంగా చందుర్తిలో చోటుచేసుకున్న పరిణామాలపై స్థానిక పోలీసులు స్పష్టతనిచ్చారు. పోలీసులపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాలను చందుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ తీవ్రంగా ఖండించారు. కేవలం రాజకీయ మైలేజ్ కోసం, వ్యక్తిగత పబ్లిసిటీ కోసం పోలీసు వ్యవస్థను అప్రతిష్ట పాలు చేసేలా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. చందుర్తి ఆరో వార్డు సభ్యుడు మర్రి రమేష్ అనే వ్యక్తి సోషల్ మీడియా గ్రూపుల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు విషయంపై అన్ని కుల సంఘాల సభ్యులు గుమిగూడాలని పోస్టు షేర్ చేశారు. ఈ కార్యక్రమం వల్ల ప్రభుత్వ 'ప్రజా పాలన'కు ఎలాంటి ఆటంకాలు కలగకూడదనే ఉద్దేశంతో, ముందుజాగ్రత్తగా అతన్ని కేవలం కౌన్సిలింగ్ కోసం మాత్రమే పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం జరిగింది. కౌన్సిలింగ్ అనంతరం అతన్ని తిరిగి పంపివేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే, ఈ విషయాన్ని కొందరు వ్యక్తులు వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎస్సై మండిపడ్డారు. కేవలం ఒక్కరిని కౌన్సిలింగ్ కోసం పిలిస్తే, దానికి సంబంధం లేని మరో పదిమంది వ్యక్తులు స్టేషన్ ముందు ఫోటోలు దిగి, అందరినీ అక్రమంగా అరెస్టు చేసినట్లు చిత్రికరించడం దురదృష్టకరమన్నారు. స్టేషన్ నేమ్ బోర్డు కనిపిస్తూ, పోలీసులను అవమానించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఇకపై పోలీస్ స్టేషన్‌ను వేదికగా చేసుకుని, పోలీసులపై అసత్య ప్రచారాలు చేసే వారిపై డేగ కన్ను ఉంటుందని, అటువంటి వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని, వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని ఆయన సూచించారు.

# గిఫ్ట్ ఏ స్మైల్ లో విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్ పెన్నులు అందజేత



**ముస్తాబాద్/ మార్చి 6 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం లోగల ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు 486 మందికి గిఫ్ట్ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో ముస్తాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భూంపల్లి సురేందర్ ఆధ్వర్యంలో మండలంలో గల పది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పెన్నులను అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కష్టపడి చదువుకొని ప్రభుత్వ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చేలా పట్టుదలతో ఉన్నతమైన అవకాశాలతో మంచి గ్రేడ్ ఇతర విద్యార్థులకు ఆదర్శం కావాలన్నారు ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు సర్వర్ పాషా మాది టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గూడూరు భరత్ విద్యార్థి విభాగం శీలం స్వామి పలువురు టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు



# చందుర్తిలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

## ప్రారంభం... పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్









**రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం/ మార్చి 06 ప్రజా దివాస్**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దరి చేరవేయడమే "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలకు అందిస్తున్న రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల లబ్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను నమోదు చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల ఆశయాలను కార్యరూపంలోకి తీసుకువస్తున్న ప్రజా ప్రభుత్వం

- జూన్ 12 వ తేదీ దాకా 99 రోజులు వివిధ కార్యక్రమాలు
- వేములవాడ--కోరుట్ల 100 ఫీట్ల ఫోర్ లైన్ రోడ్డు... రాష్ట్ర ప్రభుత్వ నిధులే
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
-వేములవాడ పట్టణంలో ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ, కార్యక్రమాలు
- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ / మార్చి 06 ప్రజా దివాస్** ప్రజల ఆశయాలను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకువస్తున్నట్లు.. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ దాకా చేపట్టనున్న కార్యక్రమానికి వేములవాడ పట్టణంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి హాజరై ప్రారంభించారు...వేములవాడలో పారిశుధ్య, ఇతర పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, వాటి పై ప్రజలను చైతన్య పరచాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీల ప్రజలకు ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కింద ఆరు విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యుల ఆద్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.. విద్యార్థి దశలో కలలు కనాలని.. వాటిని ఇష్టంతో మంచిగా చదివి సాకారం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు...సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేశారని తెలిపారు. దానికోసం స్థల సేకరణ జరుగుతుందని చెప్పారు. ఈ విద్యాలయంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. యువత కోసం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ప్రారంబించిందని విప్ తెలిపారు. వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్సు స్టాండ్ మార్గంలో రోడ్డు పూర్తి చేశామని తెలిపారు. 47 కోట్లతో శ్రీ రాజ రాజేశ్వర ఆలయం నుంచి మూల వాగు వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేయిస్తున్నామని వెల్లడించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో భక్తులకు కోసం వసతులు కల్పించామని పేర్కొన్నారు. కార్మిక, ధార్మిక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నామని తెలిపారు...మర్రిపల్లి ప్రాజెక్ట్, కలికోట సూరమ్మ ప్రాజెక్ట్ పనులు, కాలువ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. వేములవాడ నుంచి కోరుట్ల రోడ్డును హ్యామ్ కింద రూ. 160 విస్తరించనున్నామని విప్ తెలిపారు. వేములవాడ పట్టణంలో 628 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 7,020 మందికి రూ. 500 లకే సిలిండర్ ఇస్తున్నామని, 3,003 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేశామని, 1,200 మందికి రైతులకు రుణమాఫీ చేశామని, 3,722 రైతు భరోసా మంజూరు చేశామని వెల్లడించారు... 7,147 కుటుంబాలకు గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ అందుతుందని వివరించారు. 80 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ అందిందని తెలిపారు. 653 మందికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ కింద ఏడాదిలో చెక్కులు అందించామని వెల్లడించారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని విప్ పిలుపు నిచ్చారు..

**వేములవాడ--కోరుట్ల 100 ఫీట్ల ఫోర్ లైన్ రోడ్డు... రాష్ట్ర ప్రభుత్వ నిధులే**

వేములవాడ నుంచి కోరుట్ల (ఎఖీన్‌పూర్) వరకు నిర్మించబడనున్న 100 ఫీట్ల రహదారి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతోనే మంజూరైందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు..ఈ రహదారి మంజూరును కేంద్ర ప్రభుత్వ నిధులుగా చూపిస్తూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా దుష్ప్రచారమని ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆర్‌డబి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రాష్ట్ర స్థాయిలోనే అమలవుతోందని తెలిపారు..
సుమారు 160 పై చిలుకు కోట్లతో ఈ రహదారి చందుర్తి, రుద్రంగి, కథలాపూర్, సిరికొండ మార్గంగా ఎఖీన్‌పూర్ వరకు విస్తరించనుందనీ ,రాష్ట్ర ప్రభుత్వం హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హామ్) ద్వారా ఈ పనులను చేపడుతోందని తెలిపారు..గతంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కలిసిన పాత వీడియోలను చూపిస్తూ ఈ రహదారి తామే తీసుకువచ్చినట్లు చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని విమర్శించారు. మీరు కేంద్రం నుంచి నాలుగు వరుసల రహదారి తీసుకువస్తే మాకు అభ్యంతరం లేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులతో మంజూరు చేసిన పనులను కేంద్రం పేరుతో ప్రచారం చేయడం సరికాదు అని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు..అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక మార్చి 3 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి .. మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల ప్రణాళిక ప్రకటించారని వెల్లడించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టల్స్ లోపల, బయట పరిశుభ్ర పనులు చేయాలని, రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయాలని, డంపింగ్ యార్డ్ పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. యువతకు జాబ్ మేళాలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ కింద జిల్లాలోని రైతులు తమ వివరాలు వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని పిలుపు నిచ్చారు... వచ్చే నెల ఏప్రిల్ 2వ తేదీన గ్రామసభ ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం కీలకమని స్పష్టం చేశారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రత్యేక వైద్య నిపుణుల ఆద్వర్యంలో ఆరోగ్య పరీక్షలు చేయిస్తామని తెలిపారు. ఏమైనా పెద్ద అనారోగ్య సమస్య ఉంటే వేములవాడ ఏరియా ఆసుపత్రి, జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రి లో వైద్యం, మందులు అందిస్తామని వెల్లడించారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని, అన్నంతోపాటు అన్ని కూరలు తినాలని సూచించారు. పదో తరగతి, మిగితా తరగతుల విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని దానికి అనుగుణంగా చదవాలని.. రాయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, మంచి స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు, మహిళా సంఘాల సభ్యులు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెల్త్ ప్రొఫైల్ లో భాగంగా వైద్య పరిక్షలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. వేములవాడ లో ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేసి, ఉగాదికి గృహ ప్రవేశం చేసేలా చూడాలని, పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మెన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు..





## వేములవాడలో అంగరంగ వైభవంగా రాజన్న కళ్యాణం..

# పరవశించిన భక్తజనం!

**-శివనామస్మరణతో మారుమోగిన క్షేత్రం.. భక్తుల సమక్షంలో శ్రీ పార్వతి రాజరాజేశ్వరుల వివాహ మహోత్సవం!**

**- రాజన్న క్షేత్ర అభివృద్ధికి 150 కోట్లు.. కళ్యాణ వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్!**

**- చరిత్రలో తొలిసారి గుడి చెరువు పార్కింగ్ ఏరియాలో శివ కళ్యాణం.. పోటెత్తిన 70 వేల మంది భక్తులు!**



**రాజన్న సిరిసిల్ల వేములవాడ మార్చి 06 ప్రజా దివాస్**
దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినోత్సవాలను పురస్కరించుకుని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని శివ కళార్చన వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కళ్యాణ మండపంలో లోక కళ్యాణార్థం స్వామివారి వివాహ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కంరాజు గారు మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్ గారు మున్సిపల్‌కౌన్సిలర్లు పాల్గొన్నారు...ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న సన్నిధిలో శివ కళ్యాణం భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మొట్టమొదటిసారిగా గుడి చెరువు ఆవరణలోని పార్కింగ్ ఏరియాలో ఉన్న శివకళ్యాణం స్టేజ్ మీద ఈ వేడుకను నిర్వహించడం విశేషమని ఆయన పేర్కొన్నారు. సుమారు 70 వేల మందికి పైగా భక్తులు ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు తరలివచ్చారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ అధికారుల సమన్వయంతో అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో రాజన్న ఆలయాన్ని 150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, అతి త్వరలోనే ఆలయ రూపురేఖలు మారిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. ఆ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో లోక కళ్యాణం జరిగి ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకం



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 6 ప్రజా దివస్**
సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని గుర్తిస్తూ, వారి సాధికారతను ప్రోత్సహించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించబడుతుందని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీమతి.ఈ.జ్యోతి అన్నారు.శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని సిరిసిల్ల అప్పర్ ప్రైమరీ స్కూల్లో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి.నీరజ గారి ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, ఖూూూ శ్రీ. పి.లక్ష్మణాచారి గారి సమన్వయంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా జరుపుకుంటామని, మహిళలు కుటుంబం, సమాజం, విద్య, వైద్యం, రాజకీయాలు, వ్యాపారం వంటి అన్ని రంగాలలో విశిష్టమైన సేవలను అందిస్తూ సమాజ పురోగతికి ఎంతో తోడ్పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, భద్రత మరియు గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు శ్రీ. చింతోజు భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్ల కుమార్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## బండపల్లి పాఠశాలలో యూత్ కాంగ్రెస్ 'విద్యా కానుక'.. విద్యార్థులకు సామాగ్రి పంపిణీ చేసిన న్యాత నవీన్!

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం.. బండపల్లి విద్యార్థులకు అండగా వేములవాడ యూత్ కాంగ్రెస్!**

**విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందడుగు..**

**స్కూల్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని హామీ!**

**బండపల్లి జడ్పీహెచ్ఎస్ కు పూర్వ వైభవం తెస్తాం.. న్యాత నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా సామాగ్రి పంపిణీ!**

రాజన్న సిరిసిల్ల జిల్లా/// వేములవాడ మార్చి 06 ప్రజా దివాస్



వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ ఆధ్వర్యంలో చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లతో పాటు ఆరు రకాల అత్యవసర విద్యా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాత నవీన్ మాట్లాడుతూ గ్రామంలో పదో తరగతి విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి తల్లిదండ్రులు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలలోని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్స్ వంటి వస్తువులను అందిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ సర్పంచ్ కటకం మల్లేశం, ఉప సర్పంచ్ ఇస్సాక్ నాయకత్వంలో పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు ఏనుగు లచ్చి రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ న్యాత దాసు, వార్డు సభ్యులు న్యాత సుమన్, కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ రెడ్డి, అజీమ్, అన్వర్ తో పాటు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించుకోవాలి

**ఈ నెల 6 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు షెడ్యూల్ విడుదల**



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 6 ప్రజా దివాస్**
"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించు కోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఎస్ రజిత తెలిపారు. అన్ని వయసుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. నిర్దేశిత రోజులలో నాలుగు దశలలో నిర్వహిస్తామని వివరించారు. మొదటి దశలో మార్చి 6 నుండి మార్చి 31 వరకు గర్భిణీలు, వృద్ధులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సెంటర్ ద్వారా ఆరోగ్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, ఆర్ బీ ఎస్ కే బృందాలు, ఇతర వైద్య సిబ్బందికి గర్భిణీ స్త్రీలకు , తల్లులకు అందవలసిన పోషకాహారము, వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించడంతోపాటు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లపై ఆరోగ్య పరీక్షలు ప్రత్యేక వైద్య నిపుణుల ప్రసూతి స్త్రీ రోగనిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, నేత్ర, కీళ్ల ఎముకల, దంత వైద్య నిపుణులతో పాటు జనరల్ మెడిసిన్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన గర్భాశయ క్యాన్సర్ రాకుండా స్త్రీలకు హెచ్ పీవీ వ్యాక్సిన్ ఇస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతోఈ తేదీల్లో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ నెల (మార్చి )7వ తేదీన హనుమాజిపేట, 9వ తేదీన కోనరావుపేట, 10 వ తేదీన లింగన్నపేట, 11 వ తేదీన పోతుగల్, 12 వ తేదీన విలాసాగర్, 13 వ తేదీన ఎల్లారెడ్డిపేట, 14 వ తేదీన పెద్దలింగాపూర్, 16 వ తేదీన నేరెళ్ల, 17 వ తేదీన తంగళ్ళపల్లి,18 వ తేదీన కొదురుపాక, 20 వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, 23 వ తేదీన సిరిసిల్లలోని అంబేద్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నగర్, 24వ తేదీన చీర్లవంచ, 25 వ తేదీన బోయినపల్లి, 26 వ తేదీన కోనరావుపేట,28 వ తేదీన పోతుగల్, 30 వ తేదీన విలాసాగర్, ఈ నెల (మార్చి) 31 వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య ఆరోగ్య శిబిరాలు, పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత తెలిపారు.

## జిల్లాకు ప్రతిష్టాత్మకం కోర్టు భవన నిర్మాణం

**- నేడు(శనివారం) శంకుస్థాపన కార్యక్రమం**

**- అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు**



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 6 ప్రజా దివాస్** నూతనంగా నిర్మించ తలపెట్టిన కోర్టు భవనాల సముదాయం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి మరో ఆకర్షణగా నిలవనుంది. మరో 50 సంవత్సరాల అవసరాలు తీర్చేలా అత్యాధునిక వసతులతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన జరగనుంది. పాత కోర్టు స్థానంలోనే సుమారు 5 ఎకరాల విస్తీర్ణం లో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో రూపుదిద్దుకోనున్న భవనంలో 12 రకాల న్యాయస్థానాలు కొలువుదీరేలా తీర్చిదిద్దనున్నారు. ఒక్కో అంతస్తు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం జరగనుంది. విశాలమైన కోర్టు హాళ్లు, ప్రతి అంతస్తులు ప్రత్యేకంగా వాష్ రూమ్ లు కక్షిదారులకు వెయిటింగ్ హాళ్లు కనీసం 300 కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తూ నూతన భవనం నిర్మించబోతున్నారు. సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు నిర్మాణ శైలితో రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన కార్యక్రమంన్యాయస్థాన భవన సముదాయానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేకంగా కోర్టు ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి నీరజ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానాల్లో శంకుస్థాపనలో పాల్గొంటున్నారని వెల్లడించారు. వీరితోపాటు హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోని న్యాయవాదులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.సమావేశంలో న్యాయమూర్తులు శ్రీమతి బి పుష్పలత, శ్రీమతి రాధిక జైస్వాల్, శ్రీ పి లక్ష్మణ చారి, శ్రీ ఏ ప్రవీణ్ కుమార్, న్యాయవాదుల సంఘం సిరిసిల్ల వేములవాడ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సదానందం సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు



## తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి



**తంగళ్ళపల్లి / మార్చి 06 ప్రజా దివాస్** తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బొలెరో వాహనం, ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్న ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.